క్లుప్తంగా

4న ఎన్జీవోస్ హోమ్‌లో బ్రెయిలీ జయంతి



మాట్లాడుతున్న ఫెడరేషన్ అధ్యక్షుడు

తిరుపతి కల్చరల్: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లెండ్ జిల్లా శాఖ అధ్వర్యంలో 4వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ఎల్‌బీసీ రోడ్డులోని ఏపీ ఎన్‌జీవోస్ హోమ్‌లో లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.విజయశేఖరెడ్డి ,జి.ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రెయిలీ జయంతి వేడుకలలో భాగంగా స్త్రీ, పురుషులకు వేర్వేరుగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు. పోటీలలో పాల్గొన దలచిన వారు 4వ తేదీ ఉదయం 10 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఈ వేడుకలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అంధులందరూ పాల్గొనాలని కోరా రు. సమావేశంలో నాగ పద్మలత పాల్గొన్నారు.

కెరీర్ అడ్వాన్స్‌మెంట్‌పై అవగాహన సదస్సు


విద్యార్థినికి ప్రశంసాపత్రం ఇస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల మైక్రోబయోలజీ విభాగం విద్యార్థులకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ ఆన్ మైక్రోబయోలజీ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించింది. ముఖ్యఅతిథులుగా మైక్రోబయోలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అరవింద్ దేశ్‌ముఖ్, ఏపీ ఏంబీఎస్‌ఐ ఏపీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ నరసింహా మాట్లాడారు. బయో ఫెస్టిసైడ్స్, బయో ఫర్టిలైజర్స్, ప్రొబయోటిక్స్, బయో ఇన్ఫోమ్యాటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మైక్రోబయోలజీపై ఏర్పాటు చేసిన పలు రకాల పోస్టర్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. క్విజ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి ప్రశంసాపత్రాలను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బీ.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర్, హెచ్‌ఓడీ వీ.వెంకటలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

తిరుపతి కల్చరల్: గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చిన ఆ హామీలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో ఇల్లులేని నిరుపేదల నుంచి అర్జీలు సేకరించి ఆర్డీఓ కార్యాలయం వద్ద 9వ తేదీన పెద్ద ఎత్తున ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు విశ్వనాథ్, కేవై రాజా, ఎస్. శివ, రాధాకృష్ణ, పద్మనాభరెడ్డి, చలపతి, ఎస్. శ్రీరాములు, మంజుల, రత్నమ్మ పాల్గొన్నారు.

మెగా గోకులంపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి రవి కుమార్

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిని మెగా గోకులంపై అధికారులు గురువారం మండలంలోని నారావారిపల్లెలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, గ్రామంలోని పాడి ఆవులన్నింటిని ఒకే ప్రాంతంలో ఉంచడం ఈ పథకం ఉద్దేశమని, ప్రభుత్వమే సుమారు రూ.35లక్షలతో షెడ్డును నిర్మించి ఇస్తుందన్నారు. సుమారు 40కు పైగా పశువులను షెడ్డులో ఉంచేందుకు దోహదపడతాయన్నారు. వాటితో పాటు గడ్డి కత్తిరింపు యంత్రం, వాటర్ ట్యాంకు, ఫీడ్ ప్లాంట్‌తో పాటు పాలు పితికే యంత్రాలను సైతం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. రైతులు గ్రూపుగా ఏర్పాటై దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీడీ డాక్టర్ ఉమామహేశ్వరి, ఏడీ చంద్రశేఖర్ రెడ్డి, నారావారిపల్లె పశువైద్యాధికారి డాక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు శిక్షణ

చంద్రగిరి: మామిడి చెట్లు పూత దశకు వచ్చినప్పుడు తీసుకోవాల్సినన సస్యరక్షణ చర్యలపై గురువారం మండలంలోని భీమవరంలో రైతులకు ఉద్యాన శాఖ ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. జిల్లా ఉద్యాన అధికారి దశరథ రామిరెడ్డి మాట్లాడారు. తోటలోని పూత ఏ దశలో ఉందో గమనించి సరైన పురుగు, తెగులు మందులు పిచికారీ చేయాలన్నారు. రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం గ్రామాల్లోని రైతులు సంఘాలు ఏర్పాటు చేసుకుంటే కలిగే మేలు గురించి వివరించారు. అనంతరం స్థానం(పేరూరు) కీటక శాస్త్రవేత్త రంజిత్ మాట్లాడారు. ప్రసుత్తం పూత లో రసం పీల్చే పురుగులు, తెగుళ్ల ఉధృతి అధికం అయ్యే అవకాశం ఉందని, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కలుపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు సుహాసిని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

■ జీవకోనలో ఓ వ్యక్తి రెండు అంతస్తుల ఇంటిని 2016లో నిర్మించాడు. మూడు నెలల క్రితం వరకు ఆ వ్యక్తికి ప్రతి అర్ధ సంవత్సరానికి కేవలం రూ.1,800 మాత్రమే మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లిస్తూ వస్తు న్నాడు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి, మీ ఇంటికి ఆస్తి పెరిగిందంటూ అంటూ ఏకంగా 6 నెలలకు ఆస్తి పనులను రూ.8వేల పెంచేశారు. ఏడాదికి రూ.16వేలు పన్ను వడ్డించారు. 8 ఏళ్లుగా పెరగని పన్ను ఇప్పుడు ఎందుకు పెరిగిందని అతను నిలదీసినా ఫలితం శూన్యం. తన ఇంటికి అన్ని ఏళ్లపాటు తక్కువగా పన్ను వసూలు చేయడం రెవెన్యూ అధికారుల తప్పిదమే అవుతుంది కదా? ఒక్కసారిగా ఇప్పుడు భారీ స్థాయిలో పెంచేయడం వెనుక ఉద్దేశమేమిటని ఆ యజమాని తన ఆవేదన వ్యక్తం చేశారు.

■ సత్యనారాయణపురం సమీపంలో నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి రేకుల ఇంటిని నిర్మించుకున్నాడు. బిలో ప్రాపర్టీ కింద ఆ ఇంటి యజమానికి గత ప్రభుత్వ హయాంలో కేవలం 90 రూపాయలు మాత్రమే చెల్లిస్తూ వస్తున్నాడు. ప్రస్తుతం ఆ ఇంటికి ఆస్తి పన్నును రూ.3వేలకు పైగా పెంచినట్లు అక్కడి రెవెన్యూ అధికారి మాయ చేసి చూపించాడు. యజమాని ప్రశ్నించగా తమ చేతిలో ఏమీ లేదని.. గూగుల్ మ్యాప్ సర్వీస్‌తో అంత వచ్చిందంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. ఆ రెవెన్యూ అధికారికి మరో వ్యక్తి ద్వారా చేతులు తడిపాక ఆస్తి పన్ను రూ.1100 కు తగ్గించడం గమనార్హం ! ఇలా అనేక అవకతవకల మధ్య నచ్చిన వారికి ఒక విధంగా.. ఎలాంటి సిఫార్సులు లేని వారికి మరోలా పన్నుల మోతలో హెచ్చుతగ్గులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పన్ను పోటు

ప్రజలకు మేలు చేస్తానని అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని చిత్తశుద్ధితో నెరవేర్చే ప్రయత్నం చేయకపోగా ప్రజలపై మరింత భారం మోపుతోంది. ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటివరకు ఒక పథకం మినహా మిగిలిన ఐదు పథకాలకు ఎగ నామం పెట్టింది. మేలు చేయకపోగా, భారీగా విద్యుత్ చార్జీలను, అలాగే గడచిన మూడు నెలల్లో ఆస్తి పన్నులను సైతం భారీగా పెంచింది. ఇంటింటా సర్వే పేరిట భారీగా ఆస్తి పన్నులను కూడా పెంచి ప్రజల నడ్డి విరుస్తోంది.

- తిరుపతి ప్రజలపై ఆస్తి పన్ను భారం
- అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.17.13 కోట్ల మేర పెంచేసిన కూటమి ప్రభుత్వం
- మరింత భారాన్ని మోపేందుకు యత్నం

టాస్క్‌ఫోర్స్ తిరుపతి : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్నులను ఇటీవల కాలంలో భారీగా పెంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపల్ కార్పొరేషన్ పనుల పెంపును తొలి ప్రాజెక్టుగా చేపట్టింది. ఇంటింటా సర్వే పేరుతో తక్కువగా ఉన్న ఇళ్లకు భారీ మొత్తంలో ఆస్తి పన్నులను విధించి ప్రజలపై మోయలేని భారాన్ని మోపింది. ఈ సర్వేను అత్యంత రహస్యంగా చేపట్టారు. పన్నులకు సంబంధించి డిమాండ్ డ్రాఫ్ట్ చేతులో పెట్టగా పెరిగిన పన్ను చూసిన ప్రజలు ఖంగుతిన్నారు. ఇళ్లకు కొలతలు సక్రమంగా వేశారా, లేదా? అనేది పరిశీలించకనే ఇష్టారాజ్యంగా పన్నులను బాదేశారు. దీంతో తిరుపతి ప్రజలు లబోదిబోమంటున్నారు. 2023 అక్టోబర్‌లో రూ. 62,06,80,429 ఉండగా, 2024 డిసెంబర్ కల్లా ఈ ఆస్తి పన్నులను రూ. రూ.79,19,98,436 పెంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 17.13 కోట్లకు పైగా ప్రజలపై ఆస్తి పన్ను భారం మోపింది. తమ ఆస్తి పన్ను పెరిగిందనే విషయం ఇప్పటికీ చాలామందికి తెలియకపోవడం విశేషం! పన్నులు చెల్లించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లిన ప్రజలకు ఇది తెలుస్తుంతడడంతో గగ్గోలు పెడుతున్నారు. కార్పొరేషన్ రెవెన్యూ అధికారులను నిలదీస్తున్నా స్పందన లేదని వాపోతున్నారు.

మరింత పెంచేందుకు యత్నం

అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రూ.17కోట్లకు పైగా పన్నులు పెంచిన విధానంలోనే ఈ ఏడాది సైతం మరింత పెంచేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆయా ప్రభుత్వ సంస్థలు స్థానికంగానే ఆదాయ వనరులు పెంచుకోవడంపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశించడంతోనే ఇలా బాదుడుకు పూనుకున్నారని బోధపడుతోంది. ప్రజలు నిలదీస్తున్నా అధికారుల వద్ద సరైన సమాధానం కరువవుతోంది. మొత్తం డిమాండ్ డ్రాఫ్ట్ పెరగడానికి ఆ స్థాయిలో అసెస్‌మెంట్లు కూడా పెరగక పోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.


-నగరపాలక సంస్థ కార్యాలయం

■ మార్చి 2024 లో		
మొత్తం అసెస్‌మెంట్	:	70,031
మొత్తం ఆస్తి పన్ను డిమాండ్	:	రూ. 62,06,80,429
■ డిసెంబర్ 2024లో		
మొత్తం అసెస్‌మెంట్	:	72,912
మొత్తం ఆస్తి పన్ను డిమాండ్	:	రూ. 79,19,98,436
కూటమి ప్రభుత్వంలో పెరిగిన మొత్తం	:	రూ. 17,13,18,007

అధికారులు ఏమంటున్నారంటే..!

కొన్ని ఇళ్లకు తక్కువగా పన్నులు ఉండడంతో ప్రభుత్వం వాటిని పెంచాలని ఆదేశించింది. ఆ మేరకు గూగుల్ సాయంతో ఆస్తిపన్నులను పెంచేందుకు ఇటీవల సర్వే చేశామని, తద్వారా పెంట్ హౌస్‌లు, అదనపు అంతస్తులు, ఇతర కట్టడాలకు పన్నులు విధించామని కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మరోవైపు- నగరంలో ఎక్కువ శాతం ఇళ్లకు ఇన్నేళ్లు తక్కువ పన్నులు మాత్రమే వసూలు చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఒక్కసారిగా రూ.17 కోట్లకు పైగా భారం మోపడంపై ప్రజలు మండిపడుతున్నా అధికారులు మాత్రం కుంటిసాకులు చెబుతున్నారు.

అక్రమంగా స్క్రాప్ విక్రయం తగదు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో లక్షలు విలువ చేసే స్క్రాప్‌ను బహిరంగ టెండర్లు, పత్రికా ప్రకటనలు లేకుండా విక్రయించడం ఎంతమాత్రమూ సరికాదని భారతీయ దళిత విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు కొండా యుగంధర్, ఏపీ విద్యార్థి హక్కుల సంఘం నేత రుకేష్ ఆక్షేపించారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ, వర్సిటీ అధికారులు లోపాయికారీగా అవగాహన కుదుర్చుకుని తమకు అనుకూల వ్యక్తులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రక్రియను నిలిపివేసి బహిరంగ టెండర్లను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు.

ఇరువర్గాల ఘర్షణ..కేసు నమోదు

పాకాల: నూతన సంవత్సరం వేడుకల్లో గొడవ పడిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు గురువారం పాకాల పోలీసులు తెలిపారు. వారి కథనం.. స్థానిక పార్కు వీధికి చెందిన పవన్‌కుమార్ తన భార్య ఐశ్వర్యతో కలిసి ఇంటికి వెళ్తుండగా పొగతోటకు చెందిన నవీన్, పాకాల పంచాయతీకి చెందిన సురేష్, బాలు, సుదర్శన్, చంద్రశేఖర్ పవన్‌కుమార్‌తో గొడవకు దిగారు. ఇంతలో సురేష్ ఇనుప రాడ్‌తో పవన్‌కుమార్‌పై దాడి చేశాడు. ఇక, మరో వర్గం ఫిర్యాదు ఏమిటంటే..నవీన్ తన స్నేహితుడు చంద్రశేఖర్‌తో కలసి చాకలి వీధిలో ఉండగా పవన్‌కుమార్ తన ఇంటికి వెళదామని పిలిచాడు. ఇంతలో పవన్‌కుమార్ భార్య ఐశ్వర్య నవీన్, చంద్రశేఖర్‌లను దూషించింది. అంతేకాకుండా నవీన్‌పై పవన్‌కుమార్ రాయితో దాడి చేశాడు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయి.

'తల్లికి వందనం'హామీ నెరవేర్చాలి

తిరుపతి ఎడ్యుకేషన్: ఎన్నికల హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచే నెరవేర్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, భగత్‌రవీ గురువారం ఓ ప్రకటనలో కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుచేస్తామని కూటమి ప్రభుత్వ నిర్ణయించడం తగదన్నారు. ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని తీరా అధికారంలోకి వచ్చాక ఒక్కరికేనంటూ వంచించారని విమర్శించారు.

బర్ధన్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు


బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: పేదల కోసం నిస్వార్ధంగా పని చేసిన కమ్యూనిస్టు పార్టీ జాతీయ నేత ఏబీ.బర్ధన్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు పిలుపునిచ్చారు. గురువారం బర్ధన్ 9వ వర్ధంతి పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నాయకుడు బర్ధన్ అని, ఉపాధి హామీ పథకంతో పాటు అటవీ భూములు పరిరక్షణ, సమాచార హక్కు చ ట్టం, కార్మిక చట్టాలను తీసుకురావడంలో కీలక పా త్ర పోషించారని స్మరించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు విశ్వనాథ్, రాధాకృష్ణ, బండి చలపతి, ఉదయ్‌కుమార్, లక్ష్మయ్య, ఎన్‌డీ.రవి, రామకృష్ణ, కేవై.రాజా, చంద్రశేఖర్‌రెడ్డి, కాళయ్య, శ్రీరాములు, సీహెచ్.శివ, శ్రీనివాసులు, ప్రమీలమ్మ, అలివేలమ్మ పాల్గొన్నారు.

మాజీ సైనికుని భూమి ఆక్రమణ

- దర్జాగా పట్టాలిచ్చేసిన రెవెన్యూ అధికారులు
- న్యాయం చేయాలని బాధితురాలి ని'వేదన'



మాట్లాడుతున్న బాధితురాలు గిరిజ

తిరుపతి కల్చరల్: తిరుపతి అర్బన్ మండలం, తిమ్మినాయుడుపాళెం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలలోని సర్వే నంబర్ 21/2లో ఆక్రమణకు గురైన తమ భూమిని కబ్జాదారుల నుంచి విముక్తి కలిపించి తమకు న్యాయం చేయాలని బాధితురాలు గిరిజ విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తమ కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. మాజీ సైనికుడైన తమ తండ్రి ఏలుమలైకి 1948లో అప్పటి చంద్రగిరి తాలూకా రెవెన్యూ అధికారి సదరు సర్వే నంబర్‌లో 3.36 సెంట్లు భూమి మంజూరు చేశారని, దానిని తమ తండ్రి సాగుచేసేవారని, ఆ భూమికి 28 ఏళ్లుగా శిస్తు కూడా చెల్లించినట్టు చెప్పారు. ఆ భూమిని తన తండ్రి తనకు రాసివ్వడంతో 1983 వరకు ఆ భూమి అడంగల్ ఖాతాలో కూడా తన భర్త భగవాన్ పేరిటనే ఉందన్నారు. ప్రస్తుతం తమ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, ఆ భూమికి రెవెన్యూ అధికారులు పట్టాలు సైతం మంజూరు చేశారని నిరసించారు. తమకు జరిగిన అన్యాయంపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చినా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులైనా స్పందించి, రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విజయకుమార్ తంగరాజు, హేమలత, విజయచిత్ర, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయండి

-మున్సిపల్ కమిషనర్ మౌర్య


మహిళా మార్ట్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: నగరంలోని పట్టణ పేదరిక నిర్మూలన కేంద్రం (మెప్మా)లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో గల మెప్మా కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం, కృష్ణాపురం ఠాణా వద్ద గల మహిళా మార్ట్‌ను గురువారం మధ్యాహ్నం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెప్మా కార్యాలయం వద్ద అపరిశుభ్రంగా ఉండటం, మహిళా మార్ట్ వద్ద లిఫ్ట్ మరమ్మత్తులు చేయకపోవడంపై సిబ్బందిపై మండిపడ్డారు. ఆమె మాట్లాడుతూ, మెప్మా కార్యాలయానికి పెద్ద సంఖ్యలో మహిళలు వస్తుంటారని, వారి కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీఈ మధు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, సూపరింటెండెంట్ సుధాకర్, శ్రీనాథ్ రెడ్డి, సీఎంఎం కృష్ణవేణి ఉన్నారు.

వైఎస్సార్ సీపీకి యువత, విద్యార్థుల అండ

- క్యాలెండర్ల ఆవిష్కరణలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


వైఎస్సార్ విద్యార్థి విభాగం రూపొందించిన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఓబుల్ రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా మాజీ చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ చిత్రాలతో కూడిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఓబుల్ రెడ్డి రూపొందించారు. వీటిని గురువారం తుమ్మలగుంటలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. తొలి నుంచీ రాష్ట్రంలోని విద్యార్థులు, యువత వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తున్నారని, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ అందించి డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యేందుకు చేయూతనివ్వడమే దీనికి కారణమన్నారు. అదే బాటలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం పయనించారని, భవిష్యత్తులోనూ విద్యార్థులు, యువత మద్దతుగా నిలవాలని కోరారు. డాక్టర్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ, కొత్త సంవత్సరంలో నూతన ఆలోచనలు, ఆశయాలతో విద్యార్థి లోకం ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మోహన్ రెడ్డి, భూపాల్, రాజశేఖర్ రెడ్డి, రవి, ఓం ప్రకాష్ రెడ్డి, ఓబులేసు, హరినాథ్ రెడ్డి, ముబారక్, మధుసూదన్, రఫీ, హరికృష్ణ పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌టీఐ తిరుపతి పట్టణ అధ్యక్షురాలిగా సూర్యకుమారి



తిరుపతి అర్బన్ : తిరుపతి పట్టణ ఎఫ్ఆర్‌టీఐ శాఖ మహిళా అధ్యక్షురాలిగా జీ.సూర్యకుమారి ఎంపికయ్యారు. ఈ మేరకు ఫోరమ్ ఫర్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షులు పీ.చంద్రమోహన్, జాతీయ సంయుక్త కార్యదర్శి కే.అజయ్ ప్రసన్నకుమార్ సూచనల మేరకు, ఎఫ్ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.రేవతి ఆమెను ప్రకటించారు.

పెరుమాళ్లపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

తిరుపతి రూరల్: అడ్డువస్తున్న వ్యక్తిని తప్పించబోయి ఎదురుగా వస్తున్న బైకును ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం రాత్రి తిరుపతి రూరల్ మండలం, పెరుమాళ్లపల్లి వద్ద చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ ఎస్ఐ ఎస్కే.మూర్తి తెలిపిన వివరాల మేరకు.. కొర్లగుంటకు చెందిన పవన్‌కుమార్, శివ జయంతి దంపతులు చంద్రగిరి టౌన్‌లో బంధువుల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు గురువారం బయలుదేరి వెళ్లారు. సాయంత్రం తిరిగి తిరుపతికి వస్తుండగా పెరుమల్లపల్లి పంచాయతీ గాంధీపురం వద్ద తిరుపతి నుంచి చంద్రగిరి వైపు వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న వ్యక్తిని ఢీకొట్టడంతో పాటు పవన్ కుమార్ దంపతులు పయనిస్తున్న బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ దంపతులతో పాటు గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని 108 వాహనంలో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

గ్రామసభలు వెలవెల


వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఎస్ఐ కటుంబం

తిరుపతి మంగళం: మంగళంలోని సప్తగిరినగర్, రణధీర్‌పురం, మంగళం, తిరుమలనగర్ పంచాయతీలలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీల పాలకులు, కూటమి నాయకుల తప్ప ప్రజలు పెద్దగా హాజరుకాలేదు. మంగళం-1 పంచాయతీకి సంబంధించిన రిటైర్డ్ ఎస్ఐ తన ఇంటి స్థలాన్ని తనకు తెలియకుండా మరొకరి పేరిట ఇంటి పన్ను మార్చేశారని, దానిని వెంటనే రద్దు చేయాలని, అలాగే తిరుమలనగర్ పంచాయతీలో పందుల బెడద లేకుండా చేయాలని, రణధీర్‌పురం పంచాయతీలో కాలువలు నిర్మిస్తామని ఉన్న కాలువపై పైకప్పులను పగలగొట్టారని, దీంతో దోమల మోత, దుర్గంధం సమస్య పీడిస్తోందని స్థానికులు కొందరు సమస్యలు నివేదించారు. గ్రామసభలకు పంచాయతీ అధికారులతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు హాజరవ్వాల్సి ఉంది. మంగళం పంచాయతీల గ్రామసభలలో పంచాయతీ అధికారులు మినహా ఇతర అధికారుల్వెరూ హాజరుకాకపోవడం గమనార్హం.

క్రీడల్లో సత్తా చాటిన బీసీ వెల్ఫేర్ విద్యార్థినులు


ఛాంపియన్స్‌గా నిలిచిన విద్యార్థినులతో ప్రిన్సిపల్ రేష్మా, ఉపాధ్యాయ బృందం

తిరుపతి సిటీ: స్థానిక జూపార్క్ రోడ్డులోని మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు జోనల్ స్థాయి క్రీడా పోటీలలో సత్తా చాటి ఛాంపియన్లుగా నిలిచారని ప్రిన్సిపల్ కే. రేష్మా తెలిపారు. అనంతపురం జిల్లాలో నిర్వహించిన ఈ క్రీడల్లో ఉదయమాణిక్యం మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థినులు పలు క్రీడాంశాల్లో ప్రతిభ చాటారన్నారు. చెస్, హ్యాండ్ బాల్, షటిల్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, షాట్‌పుట్ ,డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, 400మీ, 800మీ, 1500మీ పరుగు పందెం, 4 ఇన్‌టు 100 రిలే పోటీలలో విజేతలుగా నిలిచారని చెప్పారు. గురువారం వారందరినీ ప్రిన్సిపల్, పీఈటీ విమల, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

యాజమాన్య కమిటీల పాత్ర అభినందనీయం


పాకాల : మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జి


శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు

పాకాల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీల పాత్ర అభినందనీయమని ఎంఈఓ బాబ్జి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని 69 పాఠశాలల హెచ్ఎంలు , కమిటీ చైర్మన్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి పాఠశాల కమిటీ సభ్యులు ఆవాస ప్రాంతంలోని బడి ఈడు పిల్లలు బడిలో చేర్పించాలని, రోజూ వారు పాఠశాలకు వచ్చేలా చూడాలని కోరారు. పాఠశాలలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పూర్వ విద్యార్థులను కూడా పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యుల్ని చేయాలన్నారు. స్కూళ్లలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఎలా అమలవుతోందో పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 లింగయ్య, రిసోర్స్ పర్సన్లు రమేష్ బాబు, రఘునాథ్, చంద్రశేఖర్, నాగరాజ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి

రామచంద్రాపురం: తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని మండల అబ్జర్వర్, సమగ్ర శిక్ష ఏపీసీ రుక్మాంగద అన్నారు. గురువారం మండలంలోని కమ్మకండ్రిగ జెడ్పీ హైస్కూల్లో ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రుక్మాంగద మాట్లాడారు. స్కూళ్లలో విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజన నాణ్యతను తల్లిదండ్రుల కమిటీలు తరచూ పర్యవేక్షించాలని కోరారు. ఆర్పీలు హరికుమార్, పీవీఎస్ఎన్ రాజు, గోవిందరాజులు పాఠశాల యాజమాన్య కమిటీ విధులు-బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణ, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.